AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
17-7-2026 (Friday) MAIN EDITION

## చైనాపై ట్రంప్ సంచలన ఆరోపణలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనాపై సంచలన ఆరోపణలు చేశారు. 22 కోట్ల మంది అమెరికన్ ఓటర్ల డేటాను చైనా దొంగిలించిందన్నారు. ఇంటెలిజెన్స్‌లోని కొందరు అధికారులు ఈ విషయాన్ని దాచిపెట్టారని పేర్కొన్నారు. అమెరికా ప్రజలను ఉద్దేశించి ట్రంప్ మాట్లాడారు. తమ ఎన్నికలు విదేశీ శక్తులు, ముఖ్యంగా చైనా చేతుల్లో ఉన్నాయని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని ఒక "సంక్షోభం"గా అభివర్ణించిన ఆయన, భవిష్యత్తులో ఎన్నికలు "దొంగిలించబడకుండా" చూస్తానని ప్రతిజ్ఞ చేశారు.

## విద్యార్థులకు టీసీలు ఇచ్చిన హెచ్ఎం సస్పెండ్





**అక్షరటుడే, సూర్యాపేట:** పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య గొడవలు తలెత్తగా.. హెచ్ఎం విద్యార్థులకు టీసీలు ఇచ్చారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లాలో చోటు చేసుకుంది. తుంగతుర్తి మండలంలోని బండరామారం ఉన్నత పాఠశాలలో కొంతకాలంగా హెచ్ఎం హకీమ్, ఉపాధ్యాయుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. అయితే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాల్సిన హెచ్ఎం.. వారిని ఏమీ అనకుండా బడిలోని విద్యార్థులకు టీసీలు ఇవ్వడం గమనార్హం. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. దీంతో హెచ్ఎంను డీఈవో సస్పెండ్ చేశారు.

### గుజరాత్‌లో ఉగ్ర కుట్ర భగ్నం



అక్షరటుడే, గుజరాత్ : దేశంలో భారీ పేలుళ్లకు ప్లాన్ చేస్తున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌ను గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ అడ్డుకుంది. గుజరాత్‌లోని పటాన్ జిల్లా, సిద్ధ్‌పూర్ తాలూకా ఖాదియాల్ గ్రామంలో పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తోన్న నిషేధిత 'జైష్-ఎ-మొహమ్మద్' ఉగ్రవాద సంస్థకు చెందిన ఐదుగురు అనుమానిత ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు.

### బీఆర్ఎస్‌కు సభకు అనుమతి నిరాకరణ




అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : బీఆర్ఎస్‌కు పోలీసులు షాక్ ఇచ్చారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువ సంగ్రామ సదస్సుకు అనుమతి ఇవ్వలేదు. సరూర్ నగర్‌లో సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేటీఆర్ హాజరు కానున్న ఈ సదస్సుకు తాజాగా పోలీసులు అనుమతి నిరాకరించారు. అనుమతి కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని పార్టీ నేతలు తెలిపారు.

### కేంద్ర నిధుల మళ్లింపుపై బండి సంజయ్ ఆగ్రహం



అక్షరటుడే, కరీంనగర్: కేంద్ర ప్రభుత్వ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించడంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం సిరిసిల్లలో పర్యటించిన ఆయన, అమృత్ 2 స్కీమ్ కింద కార్గిల్ చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.

**రాష్ట్రంలో ఎంతో మంది అర్హులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయిపోతున్నా.. కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. దీంతో అర్హత ఉన్న చాలా మంది తమకు పెన్షన్లు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న అర్హులైన ఒంటరి మహిళలు, వితంతువులకు పింఛన్ మంజూరు చేస్తామని మంత్రి సీతక్క ప్రకటించారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

# ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్లు..



- ఒంటరి మహిళలు, వితంతువులకు అందిస్తాం
- మంత్రి సీతక్క కీలక ప్రకటన
- ఇప్పటికే భారీగా దరఖాస్తులు

తెలంగాణలో భర్తకు దూరమై ఒంటరిగా జీవిస్తున్న మహిళల జీవితాల్లో భరోసా నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా కొత్త పెన్షన్ల పంపిణీని ప్రారంభించనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. గురువారం ఆమె ములుగు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ఒంటరి మహిళలకు పింఛన్లు అందజేస్తామని తెలిపారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం..**

పింఛన్ల కోసం ఇటీవల ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో అనేక మంది తహశీల్దార్ కార్యాలయాల్లో పత్రాలు అందజేశారు. ఆయా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా అర్హులకు పింఛన్ మంజూరు చేయాలని సీతక్క అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం గానీ, తప్పులు గానీ జరగకూడదని స్పష్టం చేశారు.

**వారి పేర్లు తొలగించాలి**

పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు మరణిస్తే వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. 'ఇప్పటికే ప్రభుత్వం లబ్ధిదారుల ఫొటో వెరిఫికేషన్ నిర్వహించింది. పంచాయతీ కార్యదర్శులు పింఛన్ పొందుతున్న వారి లైవ్ ఫొటోలు తీసుకున్నారు. ఫొటోలు దిగని వారికి పింఛన్ తొలగించనున్నారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న ఉండి ఫొటోలు దిగలేని వారి పింఛన్ కట్ కానుంది. ఆ డబ్బులను కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులకు కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వ పథకాలపై ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలి' అని మంత్రి సూచించారు. ఆగస్టు 20 నుంచి 'స్వచ్ఛదనం - పచ్చదనం', నీటి కుంట - ఊటీ కుంట - పంట కుంట' పనులకు శ్రీకారం చేపడుతున్నట్లు తెలిపారు.

**వారి పరిస్థితి ఏమిటి**

పింఛన్లపై మంత్రి సీతక్క ప్రకటనతో ఒంటరి మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే వృద్ధులు, దివ్యాంగులకు కొత్త పింఛన్ల పరిస్థితి ఏమిటన్నది తెలియడం లేదు. బీఆర్ఎస్ హయాంలో 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు చివరిసారిగా కొత్త పింఛన్లు మంజూరు చేశారు. ప్రస్తుతం 57 ఏళ్లు నిండిన వారికి వృద్ధాప్య పింఛన్ అందిస్తున్నారు. అయితే 2023 తర్వాత ఎంతో మంది 57 ఏళ్లు నిండిన వారు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు, వృద్ధుల నుంచి కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించింది. అయితే తాజాగా ఒంటరి మహిళలు, వితంతువులకు మాత్రమే కొత్త పింఛన్ ఇస్తామని మంత్రి ప్రకటించడంతో తమ పరిస్థితి ఏమిటని వృద్ధులు ఆందోళన చెందుతున్నారు.

## హైడ్రోజన్ రైలు ప్రారంభించిన మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారతీయ రైల్వే చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. శుక్రవారం హర్యానా, చండీగఢ్ , పంజాబ్‌లలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ, రూ. 25,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా భారత దేశపు మొట్టమొదటి హైడ్రోజన్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. హర్యానాలోని జింద్ వద్ద ప్రారంభమైన ఈ హైడ్రోజన్ రైలు పూర్తిగా భారతదేశంలోనే రూపొందించారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన, శక్తివంతమైన హైడ్రోజన్ ఆధారిత రైళ్లలో ఒకటిగా నిలిచే ఇందులో 10 కోచ్‌లు ఉన్నాయి. సుమారు 2,600 మంది ప్రయాణికులను తీసుకెళ్లే సామర్థ్యం ఉన్న ఈ రైలు, 3,200హార్స్‌పవర్ ప్రొపల్షన్ వ్యవస్థను కలిగి ఉంది. సాధారణంగా ప్రపంచవ్యాప్తంగా నడుస్తున్న హైడ్రోజన్ రైళ్లు తక్కువ కోచ్‌లతో చిన్న మార్గాలకే పరిమితం కాగా, భారత్ మాత్రం అంతకుమించిన భారీ సామర్థ్యంతో దీనిని ప్రవేశపెట్టింది.

## చాబహార్ పోర్టుపై అమెరికా దాడులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఇరాన్‌లోని చాబహార్ ఓడరేవు వద్ద కీలక మౌలిక సదుపాయాలపై అమెరికా దాడులు చేసింది. చాబహార్ పోర్టులో శుక్రవారం జరిగిన అమెరికా వైమానిక దాడుల కారణంగా మారిటైమ్ కంట్రోల్ టవర్ కూలిపోయింది. పోర్టుపై మూడో విడత దాడులు జరిగినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా అంగీకరించింది. పోర్టులోకి జరిగే వాణిజ్య రవాణాను ఆ టవర్ పర్యవేక్షిస్తుందని ఇరాన్ పేర్కొంది. ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతంలో దీవులు, నగరాలపై అమెరికా పెద్ద ఎత్తున దాడులు చేసింది. అహ్‌వాజ్, ఖేష్మ్, దాష్తి, సిరిక్, బందర్ ఈ లెంగేలో పేలుళ్లు చోటు చేసుకున్నాయి. బందర్ ఈ ఖమీర్‌లో రెండు బ్రిడ్జిలు ధ్వంసం అయ్యాయి. ఇరాన్‌షహర్‌లో ఎయిర్‌పోర్టుపై సైతం యూఎస్ దాడి చేసింది.




## భారీగా సీఐల బదిలీ

**అక్షరటుడే, సైబరాబాద్ :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీగా సీఐలు బదిలీ అయ్యారు. మొత్తం 55 మంది సీఐలను ట్రాన్స్‌ఫర్ చేస్తూ సీపీ రమేష్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా పని చేస్తున్న కేవీ సుబ్బారావు మాదాపూర్‌కు బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న పి.రమేష్‌ను మాదాపూర్ డీఐగా ట్రాన్స్‌ఫర్ చేశారు. రాయదుర్గం ఎస్‌హెచ్‌వోగా టి భూపతి, కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా డి. స్వామి గౌడ్ బదిలీపై వెళ్లనున్నారు. కూకట్‌పల్లి డీఐగా జి.శేఖర్ రెడ్డి, బాలానగర ఎస్‌హెచ్‌వోగా జి.ప్రశాంత్, మియాపూర్ ఎస్‌హెచ్‌వోగా ఎన్. జయరాం, మియాపూర్ డీఐగా డి.విజయ నాయక్, కేపీహెచ్‌బీ ఎస్‌హెచ్‌వోగా జి.విజయ్ కుమార్, కేపీహెచ్‌బీ డీఐగా బి.భూపాల్ బదిలీ అయ్యారు.

## స్కూల్ వ్యాన్‌ను ఢీకొన్న రైలు.. ముగ్గురి మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లెవల్ క్రాసింగ్ వద్ద రైల్వే ట్రాక్ దాటుతుండగా.. స్కూల్ వ్యాన్‌ను రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు సహా ముగ్గురు మృతి చెందారు. ముర్షిదాబాద్ జిల్లాలో కర్ణ సుబర్ణ స్టేషన్ సమీపంలో లెవల్‌క్రాసింగ్ గేట్ తెరిచి ఉండటంతో పిల్లలతో వెళ్తున్న ఒక స్కూల్ వ్యాన్ రైలు పట్టాలను దాటే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో వచ్చిన ఒక లోకల్ రైలు దానిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులతో సహా ముగ్గురు మరణించారు. ఈ ఘటనలో పలువురు పిల్లలు తీవ్రంగా గాయపడగా స్థానికులు వారిని బెర్హంపూర్ ఆసుపత్రికి తరలించారు.

## 'కల్మా' హోంవర్క్ వివాదంపై స్పందించిన వీహెచ్



**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ ఓల్డ్ సిటీలో గల ఓ ప్రైవేట్ పాఠశాలలో హిందూ విద్యార్థులకు కల్మా పఠించాలని హోంవర్క్ ఇచ్చిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి హనుమంత రావు స్పందించారు. ఇది మతపరమైన అంశం అని, పాఠం బోధించే నెపంతో వారు ఇలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలను ఇలా బలవంతం చేయడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణించాలని సూచించారు. ఇటువంటి కార్యకలాపాలు శాంతిభద్రతల సమస్యలను సృష్టిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని పాఠశాలల్లోనూ ఈ విషయంపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

## ఇద్దరు పిల్లలను బావిలో తోసిసి.. ఆత్మహత్య చేసుకున్న మహిళ


**అక్షరటుడే, రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో విషాదం చోటు చేసుకుంది. ఇద్దరు పిల్లలను బావిలో తోసి, తానూ దూకి ఓ తల్లి ఆత్మహత్య చేసుకుంది. కొడంగల్ ప్రాంతానికి చెందిన వసంత, సుధాకర్ దంపతులు శంకర్‌పల్లి సమీపంలో కొత్తపల్లిలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కూతురు (15), కుమారుడు (10) ఉన్నారు. గురువారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. దీంతో వసంత తన పిల్లలను బావిలోకి తోసి ఆమె సైతం దూకింది. ఈ ఘటనలో తల్లీ కూతుళ్లు చనిపోగా.. ఆ బాలుడిని చెట్టుకొమ్మ కాపాడింది.

## తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక మార్పులు..



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** తెలంగాణ కాంగ్రెస్‌లో సంస్థాగత మార్పులు, జిల్లాల వారీగా రాజకీయ సమీకరణాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, కీలక నేతలతో వరుసగా భేటీ అవుతుండటం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఉదయం నుంచే మీనాక్షి నటరాజన్ బిజీగా గడిపారు. పార్టీలో సమన్వయం సాధించడం, జిల్లాల వారీగా సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంపై అధిష్ఠానం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. ఈ కీలక చర్చల కోసం మీనాక్షి నటరాజన్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 23 మంది సీనియర్ నేతలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు.

## అంతరిక్షంలోకి మోదీ పోస్టుకార్డు




**అక్షరటుడే, ఢిల్లీ :** భారత అంతరిక్ష చరిత్రలో మరో అద్భుత ఘట్టానికి రంగం సిద్ధమైంది. ప్రైవేట్ రంగంలో దేశీయంగా అభివృద్ధి చేసిన మొట్టమొదటి ఆర్బిటాల్ రాకెట్ 'విక్రమ్ 1' ప్రయోగానికి అంతా సిద్ధమైంది. 'మిషన్ ఆగమన్' పేరుతో జులై 18న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి ఈ ప్రయోగాన్ని స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ చేపట్టనుంది. ఈ మిషన్ ప్రత్యేకత ఏమిటంటే, అంతరిక్షంలోకి ప్రధాని నరేంద్ర మోదీ రాసిన ఒక పోస్టుకార్డును తీసుకెళ్లనున్నారు. ఆయన స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసిన ఈ కార్డుతో పాటు, భారత అంతరిక్ష రంగానికి సేవలందించిన ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు , వ్యోమగాములు రాసిన డజన్ల కొద్దీ పోస్టు కార్డులను కూడా ఈ ప్రయోగంలో భాగంగా పంపనున్నారు. దేశ అంతరిక్ష ప్రస్థానంలో కృషి చేసిన ప్రముఖులను గౌరవించేందుకు స్కైరూట్ ఈ నిర్ణయం తీసుకుంది.